క్లుప్తంగా

యాదవ కుల సంఘం మద్దతు జగనన్నకే



ఎమ్మెల్యే జోగారావును సత్కరించి మద్దతు తెలిపిన యాదవ కులసంఘం పెద్దలు

పార్వతీపురం టౌన్: యాదవ కుల సంఘం మద్దతు జగనన్నకేనని సంఘం పెద్దలు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు రెండవసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే టికెట్ వచ్చిన సందర్భంగా బాలగుడబ గ్రామానికి చెందిన యాదవ కుల సంఘం పెద్దలు, ప్రజలు, యువత ఎమ్మెల్యే జోగారావును కలిసి తమ మద్దతు ప్రకటించారు. తమ గ్రామంలోని యాదవులంతా మీకు మద్దతుగా నిలుస్తామని మాటిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండు పాల్గొన్నారు.

బంగారమ్మతల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కలశ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బెలగాం ప్రాంతంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ పూజ, ప్రతిష్ఠాపన పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



నారాయణపురంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి రమేష్‌నాయుడు

బలిజిపేట: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని మండల ఎన్నికల నోడల్ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో ఓటర్లకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రథమంగా చేయాలని కోరారు. నియమావళి ప్రకారం నిబంధనలు పాటించి ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సీడీ పీఓ సుగుణ మృతి



సుగుణ (ఫైల్)

బలిజిపేట: బలిజిపేట సీడీపీఓ సుగుణ(54) అనారోగ్య కారణంతో గురువారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యంగా ఉందనే అనుమానంతో ఆమె వైద్యసేవలు చేయించుకున్నా రు. కానీ రిపోర్టుల్లో ఎటువంటి అనారోగ్యం కనిపించలేదు. అయినప్పటికి గురువారం ఆకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో సాలూరు నుంచి విజయనగరం హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది.

లక్ష్మీ నృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ



భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీసింహ స్వామి గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి గురువారం లక్ష్మీనృసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతిగురువారం స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పూజాసామగ్రితో తరలి వచ్చి పూజల్లో పాల్గొంటున్నారన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దర్శనానంతరం కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేస్తారని చెప్పారు.

ఇంటి వద్దకే పథకాల పంపిణీ

- ఎమ్మెల్యే ఎమ్మెల్యే జోగారావు
- సంగంవలసలో ఇంటింటి ఎన్నికల ప్రచారం



సంగంవలస గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ చేయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పార్వతీపురం మండలంలోని సంగంవలస గ్రామం, పార్వతీపురం పట్టణంలోని 26వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సరదర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన పలు సమస్యలను సావధానంగా విని, తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జగన్ అందించినట్లు రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ పేదలకు ఇన్ని సంక్షేమ పథకాలను అందజేయలేదని, అటువంటి ముఖ్యమంత్రి మనకు మళ్లీ కావాలంటే, ఈ ఎన్నికల్లో జగనన్నను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు

సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశట్టిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు సంతోషంగా ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే అవ్వాతాతల పింఛన్ల విషయంలో చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌లు కోర్టుకు వెళ్లి విషపూరిత కుట్రకు దారి తీశారని, రాబోయే రోజుల్లో అవ్వాతాతల ఉసురు చంద్రబాబు కూటమికి తగులుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, పోల సత్యనారాయణ, తీళ్ల శివున్నాయుడు, సర్పంచ్ శ్రీరంజన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక వార్డు కన్వీనర్ రెడ్డి మాధవి, కోరాడ శ్రీనివాసరావు, సువ్వాడ లావణ్య, నిమ్మకాయల సుధీర్‌కుమార్, రణభేరి చిన్నంనాయుడు, ఎడ్ల త్రినాథ, జె.దివ్య, మజ్జి నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గృహసారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సూరంపేటలో ఎన్నికల ప్రచారం

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవపర్యాయం ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడమే లక్ష్యంగా గడపగడపకు వెళ్లి అభ్యర్థించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని సూరంపేటలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షులు బి.చిట్టిరాజుతో కలిసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి అమలు చేసిన సంక్షేమ పథకాలను పొందిన వారంతా రెండవ పర్యాయం ఓట్లు వేసి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ముందుగా సూరంపేట చేరుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్తున్న సమయంలో మహిళలు కుంకుమతిలకం దిద్ది రెండవ పర్యాయం ఫ్యాన్‌గుర్తుకు ఓట్లు వేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మ, మాజీ సర్పంచ్ సాంబన్నదొర, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మడక స్వామినాయుడు, శంకరనారాయణ, సత్యనారాయణ, నాగరాజు వివిధగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు తిలకం దిద్ది ఆశీర్వదిస్తున్న మహిళలు

మాజీ ఎంపీ గీతకు మాట్లాడే హక్కు లేదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి పద్మజ



సాలూరు రూరల్: మాజీ ఎంపీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత తీరును వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మజ దుయ్యబట్టారు. ఈ మేరకు గురువారం ఆమె సాలూరులోని తన ఇంటివద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడిచిన మంగళవారం సాలూరు విచ్చేసిన మాజీ ఎంపీ గీత సాలూరు నియోజకవర్గం అభివృద్ధిపై మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున అరుకు ఎంపీగా పోటీ చేసినప్పుడు స్థానిక నాయకుల మంతా ఆమె గెలుపుకోసం ఎంతో కష్టపడ్డామని చెప్పారు. ఇక్కడి ప్రజలు జగనన్న ముఖం చూసి ఆమెకు ఓటు వేశారే తప్ప గీతను చూసి చూసికాదన్నారు. అలాంటి ఆమె సాలూరు నియోజకవర్గ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పుడు కూటమిలో చేరి సాలూరు వచ్చి మళ్లీ ఓట్ల కోసం అర్థంపర్థం లేని ఆరోపణలు చేసి స్థానిక ప్రజలతో ఛీ కొట్టించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్మోహన్‌రెడ్డి దయతో గెలుపొందిన ఆమె సాలూరు నియోజకవర్గం ప్రజలను ఓట్లు అడిగే నైతిక విలువ కోల్పోయారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా అవుతున్న 33 కేవీలైన్ నిర్వహణ పనులు శుక్రవారం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులందరూ సహకరించాలని ఆ శాఖ ఏఈ బి.శంకరరావు విజ్ఞప్తిచేశారు.

సింహాద్రి అప్పన్నకు పూజలు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సింహాద్రి అప్పన్న పూజలను గురువారం భక్తిశ్రద్ధలతో చేశారు. పాత బిత్రపాడు నుంచి కొత్త బిత్రపాడు గ్రామానికి సింహాద్రి అప్పన్న విగ్రహాన్ని తప్పెటగుళ్లు, మంగళవాయిద్యాలతో తిరువీధిగా తీసుకెళ్లారు. సింహాద్రి అప్పన్నను నియమనిష్ఠలతో పూజిస్తే గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నది నమ్మకమని సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని నీరస కుటుంబ సభ్యులు సింహాద్రి అప్పన్న పూజలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

గుమలక్ష్మీపురం: మండలంలోని గొరడ, రేగిడి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ గురువారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్‌స్టేషన్ ఉండాలన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

కొమరాడ: పోలింగ్ కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. మండలంలోని విక్రంపురం, పరుశురాంపురం, మార్కొండపుట్టి, కళ్లికోట, దుగ్గి, శివిని తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అన్ని చోట్ల శాంతిభద్రతలను పరిరక్షిస్తామని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అవసరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

పాలకొండ రూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులు అంచనా వేసే యంత్రాంగం గురువారం ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో సాయుధ బలగాలతో వెలగవాడ, సింగన్నవలస తదితర గ్రామాల్లో ప్రత్యేక కవాతు చేపట్టాయి. ఎన్నికల నిబంధనలు అతిక్రమించవద్దని, యువత ఘర్షణలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలు, గతంలో జరిగిన ఎన్నికల నేపథ్యంలో కేసుల్లో చిక్కుకున్న, నేరప్రవృత్తి కలిగిన వారిపై ప్రత్యేక్య దృష్టి పెడుతున్నామని ఎస్సై తెలిపారు.

కృష్ణపల్లిలో స్వీప్ కార్యక్రమం



కృష్ణపల్లి గ్రామంలో స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురంటౌన్: ఓటర్లు తమ ఓటు వినియోగంపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని తహసీల్దార్ కె.ఆనందరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్రమం తప్పకుండా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు వివరించామన్నారు. అలాగే గ్రామ పెద్దలు, బూత్‌లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి వివరిస్తూ వారం దరితో గ్రామాల్లోని అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను పార్వతీపురం మండల విద్యాశా అధికారి సామల సింహాచలం గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలను చదివించి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. చిన్నారుల చేతి రాత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్న దృష్ట్యా విద్యార్థులను బయటకు పంపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులు డీ హైడ్రేషన్ బారిన పడకుండా వాటర్‌బెల్ అమలు చేసి మంచినీరు తాగేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



పర్యావరణ పరిరక్షణపై ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీఎస్‌జీసీ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్టు రేంజర్ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని పర్యావరణానికి హాని చేసే పనులు చేయకూడదని సూచించారు. భూగర్భ జలాలు రోజురోజుకు ఇంకిపోతున్నాయని దీనికి కారణం మనుషుల నిర్లక్ష్యమేనన్నారు. నీటిని, నేలను పరిరక్షించే బాధ్యత ప్రజలందరిపై ఉందని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ అంశంపై విద్యార్థులు నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై వెంకటరమణ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గంగరాజు మామిడిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వేసవిలో ప్రజలను అప్రమత్తం చేయాలి

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

పార్వతీపురంటౌన్: వేసవిలో ప్రబలే ఆరోగ్య సమస్యలకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంఓ డాక్టర్ టి. జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని ఎంఆర్ నగరంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య తనిఖీల వివరాలు, వైద్య పరీక్షలను పరిశీలించారు. అక్కడ ఓఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యతను తెలుసుకున్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని, తద్వారా జ్వరాలు ప్రబలే అస్కారం ఉందని, కాబట్టి క్షేత్ర స్థాయిలో గానీ, ఆరోగ్య కేంద్రాల్లో గానీ జ్వరాలు గుర్తించేటప్పుడు మలేరియా, డెంగీ సంబంధిత జ్వరమా? డీహైడ్రేషన్, వడదెబ్బ, ఇతర కారణాలా అని వెంటనే నిర్ధారణ చేయాలన్నారు. ఎండ తీవ్రత సమయంలో బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదని, ఎల్లప్పుడూ అందుబాటులో తాగునీరు ఉంచుకోవాలన్నారు. కోల్పోతున్న నీటి శాతాన్ని ఎప్పటికప్పుడు నీరు, నిమ్మరసం,మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు మొదలగు ద్రావణాలు తీసుకోవడం ద్వారా భర్తీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.అనూష, ఆరోగ్య కార్యాలయం డెమో వై.యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్స్ సత్తిబాబు, శంకరరావు, వైద్యసిబ్బంది నందిని, పోలమ్మ, బంగారునాయుడు, 104 సిబ్బంది కిరణ్, కోటేశ్వరరావు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కాలుష్య నివారణ ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

సీతానగరం: పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని నేషనల్ సైన్స్ జిల్లా కో ఆర్డినేటర్ జి.రాజారావు అన్నారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలంలోని జోగింపేట మహిళా కేజీబీవీ ప్రిన్సిపాల్ జె.సంధ్య అధ్యక్షతన విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం, ధ్వని, పొగ కాలుష్యాలను నివారించడానికి అందరూ భాస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాలయం ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ కోసం తప్పని తిప్పలు



చెట్టు కింద పెన్షన్ కోసం క్యూలో నిలబడ్డ వృద్ధులు

సాలూరు రూరల్: మండలంలోని వృద్ధులు, దివ్యాంగులు 4 వరోజు కూడా పెన్షన్ కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఎదురైంది. గతంలో 1వ తేదీన అందిన పెన్షన్ చంద్రబాబు పుణ్యమా అని వలంటీర్లను విధులు నుంచి తప్పించడంతో పెన్షన్ లబ్ధిదారులు ఎండలో ఇబ్బంది పడుతూ సచివాలయాలకు చేరుకున్నారు. గురువారం సచివాలయాల్లో కొంతమందికి పెన్షన్లు ఇవ్వగా మరికొంతమందికి ఆయా గ్రామాల్లో ఏదో ఒక చెట్టు కింద కూర్చుని వృద్ధులను క్యూలో పెట్టి పెన్షన్లు పంపిణీ చేశారు. అయితే ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులకు ఇంకా పెన్షన్లు అందకపోవడంతో వారు కొండ దిగి రాలేక ఎప్పుడు వస్తారా? అని ఎదురుచూస్తున్నారు.

రాకపోకల కష్టాలు దూరం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో నిత్యం వేలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం పార్వతీపురం-కూనేరు రహదారి. ఈ రహదారిలో గుంతలు పడి కొన్నేళ్లుగా అధ్వానంగా తయారవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రతి నెల పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుండేవి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.6.85 కోట్లు మంజూరు చేయడంతో గోతులను తొలగించి నూతన రహదారి నిర్మాణం పూర్తిచేశారు. నాడు అధ్వానంగా ఉన్న రోడ్డు..నేడు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూపుదిద్దుకోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు అధ్వానంగా ఉన్న పార్వతీపురం- కూనేరు రహదారి



నేడు అద్దంలా మారిన పార్వతీపురం-కూనేరు రహదారి

ఎమ్మెల్యే కళావతికి ఆదివాసీల మద్దతు

భామిని: మండలంలోని మనుమకొండ గ్రామ ఆదివాసీ గిరిజనులు పాలకొండ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ పత్తిక మురళి, మాజీ సర్పంచ్ నిమ్మల అన్నయ్య, పత్తిక సుగ్గుపర్మిల ఆధ్వర్యంలో గురువారం ఆదివాసీ మహిళలు సంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేసి మూకుమ్మడిగా మద్దతు ప్రకటించారు.సంపూర్ణంగా అండగా ఉంటామని, సీఎం జగనన్నను గెలిపించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. విద్యావంతుల గిరిజన గ్రామమైన మనుమకొండలో ఏకగ్రీవంగా సంపూర్ణ మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.



ఎమ్మెల్యే కళావతికి మద్దతు ప్రకటిస్తున్న ఆదివాసీ గిరిజనులు